క్లుప్తంగా

అర్ధనారీశ్వరునిగా మల్లికార్జునస్వామి దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా స్వామి అర్ధనారీశ్వరునిగా దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖర శర్మ స్వామికి విశేష అలంకారంతో పాటు ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు.

పికిల్ బాల్ విజేతలు అరుణ్ కుమార్, విన్సెంట్



గుంటూరు వెస్ట్(క్రీడలు): డెకథ్లాన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్తంగా సోమవారం స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో నిర్వహించిన ఓపెన్ పికిల్ బాల్ టోర్నమెంట్‌లో డబుల్స్ విజేతలుగా టి.అరుణ్ కుమార్, కె.విన్సెంట్ నిలిచారు. రన్నర్స్‌గా ఎస్.శ్రీధర్, సిహెచ్ శివ నిలిచారు. మహిళల విభాగంలో మధు స్మిత విన్నర్‌గానూ మంజులా దేవి రన్నర్ స్థానాలు పొందారు. అనంతరం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షులు గురుదత్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఎం.శివకుమార్, హరికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆపరేషన్ మేనేజర్‌ను కత్తితో పొడిచిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. కాజా ప్రాంతానికి చెందిన కందుల శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ శాఖలో డీఈగా పనిచేస్తున్నాడు. అయితే అరండల్‌పేటలోని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో సుమారు మూడు రకాల ఇన్సూరెన్స్‌లు కడుతున్నాడు. అయితే ఒక ఇన్సూరెన్స్‌లో నామిని పేరును మార్చాల్సిందిగా కార్యాలయానికి అక్టోబర్ 29వ తేదీన వెళ్లాడు. కంపెనీలో ఆపరేషన్స్ మేనేజర్ పులిగడ్డ రాజేష్‌ను కలసి నామిని పేరును మార్చాల్సిందిగా కోరాడు. పది రోజుల సమయం పడుతుందని చెప్పడంతో రాజేష్‌పై శ్రీనివాసరావు వాదనకు దిగి కోపంతో వెళ్లిపోయాడు. మళ్లీ కొంత సేపటికి తిరిగి కార్యాలయానికి వచ్చిరాజేష్‌పై కత్తితో దాడి చేశాడు. అరండల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శ్రీనివాసరావును అదుపు చేసే యత్నం చేశారు. మాట వినకపోవడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్పీ సీఐ ఆళ్ళహరి శ్రీనివాసరావు, నగరంపాలెం సీఐ వీరానాయక్ అదుపులో తీసుకుని కత్తిని స్వాధీనం చేసుకుని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అరండల్‌పేట పోలీసులు ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అరెస్ట్ చేశారు.

తెనాలి రౌడీషీటర్ అరెస్ట్


నగరంపాలెం: ఒకరిపై హత్యాయత్నం చేసి, స్కూటీని దహనం చేసిన రౌడీషీటర్‌ను, అతడికి సహకరించిన మరోకరిని తెనాలి టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 28న కాకుమాను ఇంద్రజిత్ తన వద్ద పని చేసే వ్యక్తిని తెనాలి ఐతానగర్‌లో వదిలి వస్తున్నాడు. అదే ప్రాంతంలో తిరిగి వస్తున్న ఇంద్రజిత్‌ను తెనాలి ఐతానగర్ పల్లెకొండవారివీధికి చెందిన రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు, చొక్కా సురేష్ అలియాస్ సుబ్బారెడ్డి పిలిచారు. దీంతో అతను ఆగకపోవడంతో అతనిపై రౌడీషీటర్ దాడికి పాల్పడ్డాడు. కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా, అతను తప్పించుకుని వెళ్లాడు. స్నేహితుని సహాయంతో తెనాలి ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. బాధితుడి స్కూటీని పెట్రోలు పోసి దహనం చేశారు. ఈ కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేశారని వివరించారు. సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డుపై 2013 నుంచి రౌడీషీట్ ఉందని చెప్పారు. ఐదు హత్య కేసులు, రెండు హత్యాయత్నం కేసులు, పలు కొట్లాట కేసుల్లో నిందితుడని పేర్కొన్నారు. తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్, తెనాలి ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్, కృష్ణా జిల్లా మాచవరం పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదైనట్లు విచారణలో తేలిందన్నారు. రౌడీషీటర్లు, వారి అనుచరులు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, సీఐ నిషార్‌బాషా పాల్గొన్నారు.

విజిలెన్స్ ఏఓగా ఆదినారాయణ

నగరంపాలెం: గుంటూరు రీజియన్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వ్యవసాయ అధికారి (ఏఓ)గా సీహెచ్ ఆదినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రకాశం జిల్లా యుద్దనపూడి ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఫిట్స్‌నూ నయం చేయవచ్చు

- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- ఎపిలెప్సీ బారిన పడుతున్న యువత, పిల్లలు
- నవంబర్ ఎపిలెప్సీ అవగాహన మాసం ఇది



ఎపిలెప్సీ నెల పోస్టర్స్

గుంటూరు మెడికల్: ఒకప్పుడు మూర్ఛవ్యాధి అంటే భయం. ఆ వ్యాధి వచ్చిన వారిని సమాజంలో వివక్ష ఉండేది. పెళ్లికి కూడా అంగీకరించేవారు కాదు. రోగికి జేబులో ఓ కార్డు పెట్టి మూర్ఛవ్యాధిస్తుడు అని రాసి ఉంచేవారంటే నమ్మండి. కానీ ఫిట్స్ వ్యాధికి వైద్యం లేదనే అపోహ చాలా మందిలో ఉండేది. వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు ఫిట్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఎపిలెప్సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2009 నుంచి నవంబర్ నెలను ఎపిలెప్సీ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

జిల్లాలో బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం మూర్ఛ వ్యాధి బాధితుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. ప్రతి వారం వంద మంది ఓపీ విభాగానికి వైద్యం కోసం వస్తున్నారు. జిల్లాలో సుమారు 90 మంది న్యూరాలజిస్టులు, ఫిజీషియన్ల వద్ద ప్రతిరోజూ పది మంది వరకు ఫిట్స్ సమస్యతో చికిత్స పొందుతున్నారు. వీరిలో యువకులు కూడా ఎక్కువగా ఉండటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మూర్ఛకు గురైన వ్యక్తిని నేలపై పడిపోకుండా పట్టుకోవాలి. వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి తలను దెబ్బతగలకుండా కాపాడాలి. బెల్టు, మెడకున్న టై లేక ఏమైనా బిగుతుగా ఉన్న బట్టలను వదులుగా చేసి, ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి. మూర్ఛ అయిపోయిన తర్వాత శ్వాస ఆడటానికి వీలుగా వ్యక్తిని ఒత్తికిల్లి పడుకునేలా శరీరాన్ని తిప్పి, నోటిలో నుంచి వచ్చే నురుగను తుడిచివేయాలి. వ్యక్తితో ప్రేమగా మాట్లాడుతూ అతడు పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకూ అక్కడే వారితోనే ఉండాలి.

డ్రైవింగ్ చేయకూడదు...

ఫిట్స్ వచ్చినప్పుడు రోగి చేతిలో తాళాలు పెట్టటం, నోట్లో నీళ్లు పోయటం, గిల్లటం, కాల్చటం లాంటి పనులు చేయకూడదు. మూర్ఛ వచ్చిన వ్యక్తి మెలికలు తిరుగుతూ ఉంటే ఆపకూడదు. రోగి చుట్టూ గుమికూడదు. వ్యక్తి పూర్తిగా కోలుకునేంత వరకు నీళ్లుగాని మరే ఇతర ద్రవ పదార్థంగాని ఇవ్వకూడదు. ఫిట్స్ రెండు నుంచి మూడు నిమిషాలుపాటు ఉండి అవే తగ్గిపోతాయి. అంతకు మించి ఎక్కువసేపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి ఉన్న వారు స్విమ్మింగ్, డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదకర మెషిన్ల వద్ద పనిచేయవద్దు.

మూర్ఛ అనగా (ఫిట్స్)...

మెదడులో ఉన్న న్యూరాన్‌లు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ లేదా మూర్ఛ అంటారు. ఇది వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. ఫిట్స్ వచ్చినప్పుడు కొంత మందికి నాలుక కొరుక్కోవడం, నోటి నుంచి నురగ కారడం గమనించవచ్చు. ఫిట్స్ ఎక్కువ సమయం ఉండే మనిషి దేహం నీలంరంగుగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకోవచ్చు.

కారణాలు...

మెదడులో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, మెదడులో రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల ఫిట్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో, పెద్దవాళ్లలో అందరిలోనూ ఈ మూర్ఛవ్యాధి వస్తుంది. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో వచ్చే అవకాశం ఉంది. స్త్రీలు ప్రసవ సమయంలో కొన్ని రకాల చికిత్స విధానాలు పాటించకపోవడం వలన, టీబీ, హెచ్ఐవీ, మెదడువాపు జబ్బుల వలన వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల ఫిట్స్ కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

వ్యాధికి ఆధునిక చికిత్స



మూర్ఛవ్యాధి అన్ని వయస్సుల వారిలో వస్తుంది. ఈ వ్యాధి ఉంటే పెళ్లిచేసుకోకూడదనే అపోహ ప్రజల్లో ఉంది. మూర్ఛవ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు. వ్యాధిని నయంచేసే అధునిక వైద్య చికిత్స పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. మందులు క్రమం తప్పకుండా వాడితే ఫిట్స్‌ను నయం చేయవచ్చు. వ్యాధి ఉన్నప్పటికి పుట్టే పిల్లలు సాధారణ పిల్లలుగానే పుడతారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది.

– డాక్టర్ పమిడి ముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్టు, గుంటూరు

మూర్ఛ వ్యాధికి ఆపరేషన్‌తో చెక్



మూర్ఛ వ్యాధిని తగ్గించేందుకు ఫిట్స్ మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. కేవలం 30 శాతం మంది ఫిట్స్ బాధితులకు ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గదు. వారికి వ్యాధిని నయం చేసేందుకు అనేక రకాల ఆధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతినెలా పది మందికి ఆపరేషన్లు చేసి ఫిట్స్ నుంచి విముక్తి కల్పిస్తున్నాం. కొన్ని రకాల ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నాం. ఆపరేషన్‌ల వల్ల నూటికి 90 శాతం ఫిట్స్ తిరిగి రావు. ఆపరేషన్ చేసిన రెండేళ్లపాటు మందులు వాడితే ఇక జీవితంలో మందులు వాడాల్సిన పని కూడా ఉండదు.

– డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరో సర్జన్, గుంటూరు

ఒక్కరోజే 98 ఫిర్యాదులు



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం ప్రజల నుంచి ఒక్క రోజే 98 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 27, ప్రజల నుంచి అర్జీలు 71 అందాయి. ప్రజలు ఇస్తున్న అర్జీలను మరుసటి వారానికి పరిష్కారం చేయాలని, తమ రోజువారీ క్షేత్ర స్థాయి పర్యటనల్లో సదరు ఫిర్యాదులను నేరుగా పరిశీలిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. సోమవారం ప్రజల నుంచి 71 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 26, ఇంజినీరింగ్ విభాగానికి 22, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 7, అకౌంట్స్ విభాగానికి 8, ఉపా సెల్‌కి 5, పరిపాలన విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ. నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని, ఆక్రమణలు పునరావృతమైతే సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులదే బాధ్యత అని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కమిషనర్ అమరావతి రోడ్‌లో ఆక్రమణల తొలగింపు, కంపోస్ట్ యార్డ్‌లో వ్యర్థాల తరలింపు, ఏబీసీ సెంటర్‌లో వీధి కుక్కల ఆపరేషన్లు, అందుకు తగిన ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

మ్యాథ్స్ ఫార్ములా ప్రపంచ రికార్డుకు సిద్ధం



విద్యార్థులతో ఏజీఎం అంజయ్య, ప్రిన్సిపాల్ నర్మద

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న మ్యాథమెటిక్స్ ఫార్ములా ప్రపంచ రికార్డు కోసం గుంటూరులోని శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులను ప్రత్యేక శిక్షణ ద్వారా సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద తెలిపారు. నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల ఏజీఎం డాక్టర్ ఎస్.అంజయ్య అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నర్మద మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు నృత్యం, చిత్రలేఖనం, కరాటే, యోగా వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వాటితో పాటు మేధను పెంపొందించేందుకు గతేడాది 40 నిమిషాల్లో వంద మ్యాథ్స్ టేబుల్స్‌ను చెప్పడం ద్వారా విద్యార్థులు గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించారని వివరించారు. అదే విధంగా ప్రస్తుతం ప్రీ–ప్రైమరీ, ప్రైమరీ విభాగాల నుంచి ఎంపిక చేసిన 11 మంది విద్యార్థులకు ప్రపంచ రికార్డును సాధించేలా శిక్షణ ఇచ్చామని చెప్పారు. మద్ది అనూషాదేవి, రెడ్డి శిరీష ఆధ్వర్యంలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణతో ఆన్‌లైన్‌లో దేశంలోని 20 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న పది వేల మంది విద్యార్థులతో తమ పాఠశాల విద్యార్థులు పోటీ పడనున్నారని చెప్పారు.

ఉమామహేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలి

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని నమ్మిన పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు వంద సార్లు రక్తదానం చేయడం అభినందనీయమని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ఉమామహేశ్వరరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గుంటూరు పట్టణంలో బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వంద సార్లు రక్తదానం చేసిన పోలిరెడ్డి ఉమామహేశ్వరరావును మానవత లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు రెండు సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారన్నారు. కోవిడ్‌లో రక్తం దొరకక అవస్థ పడుతున్న తలసేమియా చిన్నారుల కోసం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఒకేరోజు 1537 రక్తాలను సేకరించామన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును బజరంగ్ ఫౌండేషన్ బృందం ఘనంగా సన్మానించారు.

ఇంటింటి స్కిల్ సర్వే పక్కాగా చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా ఇంటింటి స్కిల్ సర్వే పక్కాగా చేసి, ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు తెలిపారు. గుంటూరు నగరంలో యువత నైపుణ్యాలపై చేపట్టనున్న సర్వేపై వార్డు సచివాలయ కార్యదర్శులకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువత నైపుణ్య గుర్తింపు కోసం ఇంటింటి సర్వేని వార్డు సచివాలయ కార్యదర్శులు చేపట్టాలన్నారు. సర్వేలో ప్రతి ఒక్కరి చదువు, ఉద్యోగం, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం, గతంలో చేసిన ఉద్యోగ సమాచారం తదితర వివరాలు సమగ్రంగా సేకరించి, వివరాల నమోదుకి కేటాయించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



విద్యార్థులతో హేమలత, రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన హిడెన్ స్టార్స్ పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.హేమలత అభినందించారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆదివారం విజయవాడ పటమటలోని రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 23వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 750 మంది క్రీడాకారులు పోటీ పడ్డారని పేర్కొన్నారు. తమ పాఠశాల నుంచి అండర్–7 బాలికల విభాగంలో బంగారు, రజత, కాంస్య పతకాలతో పాటు బాలుర విభాగంలో బంగారు, రజత పతకాలను సాధించారని తెలిపారు. అదే విధంగా అండర్–8 బాలికల విభాగంలో రజత, కాంస్య పతకాలతో పాటు బాలుర విభాగంలో రజత, కాంస్యం, అండర్–10 బాలికల విభాగంలో బంగారు, కాంస్య, బాలుర విభాగంలో బంగారు, రజత పతకాలను అందుకున్నారని పేర్కొన్నారు. ఈ విధంగా మొత్తం 13 మంది విద్యార్థులు పతకాలు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కోచ్ ఏ రవికుమార్, సహాయ కోచ్ ఏ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో కెమిస్ట్రీ వర్క్‌షాప్



టాలెంట్ టెస్ట్ విజేతలతో ప్రిన్సిపాల్ గోపీచంద్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల కెమిస్ట్రీ విభాగ ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఔత్సాహిక పరిశోధకులతో పాటు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు వర్క్‌షాప్ ఆవశ్యకత, క్రొమటోగ్రఫీని ఔషధ పరిశ్రమలోల వినియోగించు పద్ధతులను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ భిన్నరకాల ఔషధ మొక్కలు నుంచి అవసరమైన రసాయన అణుఘటకాలను, హెచ్‌పీఎల్‌సీ, క్రొమటోగ్రఫీని వేరు చేసే విధానాలను వివరించారు. రీసోర్స్ పర్సన్లుగా పాల్గొన్న డాక్టర్ పీవీఎస్ఎస్ మల్లేశ్వరరావు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు సబ్జెక్టు పరమైన అవగాహన కల్పించారు. సదస్సులో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎం.గౌరీశంకర్, పీజీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మాధవి, డాక్టర్ డి.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేతలకు అభినందన

జేకేసీ కళాశాల, యాంబిషన్స్ కెరీర్ కౌన్సెలర్స్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి కామర్స్–మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ అభినందించారు. ఈసందర్భంగా తొలిమూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన ఎస్.మౌనిక, బి.సాయి సాకేత్‌వర్మ, కె.నాగ శ్రీల్లి వరుసగా రూ.మూడువేలు, రూ.రెండువేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు అందుకున్నారు. అదే విధంగా ఐదుగురు విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు కింద రూ.500 చొప్పున నగదు అందజేశారు.

బీజేపీ పటిష్టతకు కలిసి కట్టుగా పనిచేయాలి



గుంటూరు మెడికల్: బీజేపీ సంస్థాగత నిర్మాణ కార్యశాల పార్టీ జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకుడు, ఎన్నికల కో ఇన్‌చార్జి నేరెళ్ల మాధవరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా ప్రాథమిక సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వాలు పూర్తిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో కొత్త నాయకత్వాన్ని జిల్లాకు అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోస్తాంధ్ర జోన్ సభ్యత్వ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మకుటం శివ, జిల్లా సాధారణ సభ్యత్వ ఇన్‌చార్జి పాలపాటి రవికుమార్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

లక్ష్మీపురం: చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని శంకరన్ హాల్లో సోమవారం డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను కూడా తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇప్పటికే తల్లికి వందనం అమలు చేయకపోవడం పిల్లలు ఫీజులు తల్లిదండ్రులకు భారమై చదువులకు దూరం అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రంకొండ,సత్యానందం,షేక్ గౌస్ ఖమ్మంపాటి దేవుని దయ కోటేశ్వరి పాల్గొన్నారు.

మద్యం తాగిన వ్యక్తికి రెండు రోజుల జైలు

నగరంపాలెం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురిలో ఒకరికి రెండు రోజుల జైలు, ఐదుగురికి జరిమానా విధిస్తూ ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లత సోమవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ అందించిన వివరాలు.. మద్యం తాగి బైక్‌లు నడిపిన వారిని కోర్టులో హాజరుపరిచగా వారిలో ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకరికి రెండురోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

పాత సామాన్లు అమ్మేసుకుంటున్నారు..

- నగరపాలక సంస్థలో పాత మోటార్లు, వాటర్ పైపులను అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ సిబ్బంది
- ఏసీలను కూడా వదలని వైనం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



మిర్చియార్డు వాటర్ ట్యాంకుల వద్ద వంద పైపులకు గాను మిగిలింది ఈ పైపులు మాత్రమే



హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో 5 మోటార్లకు గాను ఒక్క మోటారే ఉన్న దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహార తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలం చెల్లిన పాత మోటార్లు, రోడ్డు విస్తరణలో తొలగించిన పైపులను (ఐరన్ పైపు), ఇతర స్క్రాప్‌ను అమ్ముకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన ఇంజినీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కింది స్థాయిలో సిబ్బంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారింది. రూ.లక్షల విలువ చేసే పాత సామగ్రి అన్యాక్రాంతం అవుతున్నా ఎవరూ నోరు మెదపకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

పైపులు అమ్ముకోవడం... జేబులు నింపుకోవడం

గత కొద్ది నెలల క్రితం ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విస్తరణ క్రమంలో రోడ్డు కింద ఉన్న పాత పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్ వేశారు. అయితే సదరు పాత పైపులైన్లను ఏటీ అగ్రహారంలోని ఇంజినీరింగ్ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా మిర్చియార్డు వాటర్ ట్యాంకుల వద్ద సుమారు వందకుపైగా బీడు పైపులైన్‌లు ఉండాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 12 మాత్రమే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పాత మోటార్ల మాయం

హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో 5 పాత మోటార్లు ఉండాల్సి ఉండగా ఒక్క మోటారే ఉంది..కంకరగుంట ఆర్‌యూబీ బ్రిడ్జి వద్ద 5 హెచ్‌పీ మోటార్స్ రెండు అమ్మేసినట్లు సమాచారం. ఆర్‌యూబీలో వర్షం పడినప్పుడు నీరు తోడేందుకు ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్‌ను కూడా అమ్మేసినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు గతంలో ఇక్కడ డీఈఈగా పనిచేసిన ఓ అధికారి నగరపాలక సంస్థ కార్యాలయంలో పక్కన పెట్టిన ఏసీలను ఏఈ 3, ఏఈ 4 సెక్షన్‌లో అమర్చారు. అయితే సదరు ఏసీలను కూడా గుట్టుచప్పుడు కాకుండా తమ ఇళ్లకు తరలించి ఇంట్లో వాడుకుంటున్నట్లు సమాచారం.

రెచ్చిపోతున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లకు వాటర్ ట్యాంకుల్లో నీరు నింపడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సదరు ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల్లో యథేచ్ఛగా వాటర్ ట్యాంకులకు నీరు నింపి అమ్ముకుంటున్నట్లు సమాచారం. వాటర్ ట్యాంకులకు నీరు నింపే టెండర్ ప్రక్రియ ఏప్రిల్‌లో పూర్తయినప్పటికీ ఇప్పటికి కూడా నిత్యం రోజుకు 7, 8 ట్రాక్టర్లను అమ్ముకుంటూ తమ జేబులను నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా గతంలో ఇక్కడ పనిచేసిన వెళ్లిన ఓ మహిళా అధికారి అండదండలతో ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల్లోని అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న నిర్వాహకమిది.



ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల్లో నీటిని నింపుకుంటున్న ప్రైవేట్ ట్యాంకర్

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

పాత పైపులు, మోటార్లు మాయం అయిన సంగతి నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటాం.

–నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ

దొంగతనం కేసులో నిందితుని అరెస్ట్

లక్ష్మీపురం: దొంగతనం కేసులో పట్టాభిపురం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసిన ఘటన చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్ర వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా కంభం ప్రాంతానికి చెందిన షేక్ రఫీ కరెంటు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. చెడు వ్యవసనాలు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ప్రధానంగా షట్టర్ పగలగొట్టి అందులో నగదు, వస్తువులు చోరీ చేయడం అలవాటుగా చేసుకున్నాడు. ఈ క్రమంలో గుంటూరులోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్టోబర్ 2వ తేదీన శ్యామలానగర్‌లోని మై మార్ట్ సూపర్ బజార్ దుకాణం వద్దకు వెళ్లి సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, షాపులోని రూ.92,500 దొంగలించాడు. అదే నెలలో 14వ తేదీన పెదకాకాని రోడ్డులోని కారును దొంగలించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నల్లపాడు రైల్వే స్టేషన్ గేటు వద్ద నిందుతుడి సమాచారం మేరకు ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ వీరాంజనేయులు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు రఫీని అదుపులో తీసుకుని అతడి వద్ద ఉన్న కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.